
సాక్షి కామారెడ్డి

ఆదివారం । 8 । జూన్ । 2025



కరోనా కేసు

నిజామాబాద్ నగరంలో కరోనా కేసు నమోదయ్యింది. బాధితుడికి జీజీహెచ్‌లో చికిత్స అందిస్తున్నారు.

- 10లో ▸



వంతెన నిర్మించండి

విఠల్‌వాడి, లింగంపల్లి మధ్యలోని వంతెన శిథిలావస్థకు చేరింది. నూతన వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

- 11లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40.9 /24.2

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు కూచిపూడి కళాక్షేత్రం వార్షికోత్సవం

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి కూచిపూడి కళాక్షేత్రం వార్షికోత్సవాలను ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి వరకు స్థానిక కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కళాక్షేత్రం వ్యవస్థాపకులు జాతీయ నృత్యకళాకారుడు వంశీప్రతాప్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా ప్రముఖ సినీ నటి ఆమని, తెలంగాణ ఫిల్మ్ చాంబర్ చైర్మన్ పి.రామకృష్ణ గౌడ్, టీవీ నటుడు ప్రభాకర్‌లను ఆహ్వానించామని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కళాభిమానులను కోరారు.

'యశ్వంత్ సాధన యువతకు ఆదర్శం'



కామారెడ్డి క్రైం : యువ పర్వతారోహకుడు యశ్వంత్ తలపెట్టిన 'హర్ శిఖర్ పర్ తిరంగా' కార్యక్రమం యువతకు ఆదర్శమని ఎస్పీ రాజేశ్ చంద్ర పేర్కొన్నారు. జిల్లాకు చెందిన యశ్వంత్ మిజోరాం, మణిపూర్, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లోని ఎత్తైన శిఖరాలను విజయవంతంగా అధిరోహించాడు. ప్రతి శిఖరంపై త్రివర్ణ పతాకంతో పాటు ఎస్పీ రాజేశ్ చంద్ర సేవలకు గౌరవ సూచకంగా ఆయన ఫొటోను ప్రదర్శించినట్లు యశ్వంత్ తెలిపాడు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రాజేశ్ చంద్రను కలిసి, తాను అధిరోహించిన శిఖరాలపై ప్రదర్శిస్తూ తీసిన ఫొటోలను ఎస్పీకి అందించాడు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని శిఖరాలను అధిరోహించాలన్నారు. యశ్వంత్ ఇప్పటివరకు మౌంట్ కిలిమంజారో, మౌంట్ ఎల్బ్రస్, మౌంట్ కోసియస్కో, కాంగ్ యాట్సే ఐఐ, యూనామ్, ఎవరెస్ట్ బేస్ క్యాంప్ తదితర శిఖరాలను అధిరోహించాడు. ప్రపంచంలోని ఏడు ఖండాల్లోని ఎత్తైన శిఖరాలను అధిరోహించడం తన లక్ష్యమని పేర్కొన్నాడు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి



పెద్దకొడప్‌గల్: విద్యుత్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పిట్లం మండలానికి చెందిన అల్లాపూర్ గ్రామస్తులు శనివారం పెద్దకొడప్‌గల్ విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం ఇన్‌చార్జి విద్యుత్ మండల అధికారికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిట్లం మండలంలోని చిన్నకొడప్‌గల్ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి తమ గ్రామానికి విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. ఏమైనా విద్యుత్ సమస్యలుంటే పెద్దకొడప్‌గల్ జేఎల్ఎం, సిబ్బంది వచ్చి పరిష్కరిస్తారన్నారు. నెల రోజుల క్రితం జేఎల్ఎం బదిలీ అయ్యారని, అప్పటినుంచి ఏ అధికారి స్పందించడం లేదని పేర్కొన్నారు. ఎవరిని అడిగినా ఎల్‌సీ ఇవ్వడం లేదన్నారు. వారం రోజుల వ్యవధిలో రెండు రోజులు గ్రామంలో కరంటు లేక ఇబ్బందిపడ్డామన్నారు. జేఎల్ఎంను నియమించి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శి హత్య



పిట్లం : చిన్నకొడప్‌గల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ధరావత్ కృష్ణ (28) అనే పంచాయతీ కార్యదర్శి హత్యకు గురయ్యారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రూం తండాకు చెందిన దరావత్ కృష్ణ చిన్నకొడప్‌గల్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. దీంతో అతడి తండ్రి గోప్యానాయక్ శుక్రవారం పిట్లం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. గాలింపు చేపట్టగా శనివారం చిన్నకొడప్‌గల్ శివారులోని రెడ్డి చెరువులో మృతదేహం లభించింది. మృతదేహాన్ని బయటకు తీసిచూడగా తలపై, శరీరంపై గాయాలు ఉన్నాయి. అతడిని హత్య చేసి చెరువులో పడేసి ఉంటారని అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



పాతంగల్ ఖుర్దు గ్రామం

లింగంపల్లి కలాన్ గ్రామం

పాతంగల్ కలాన్ గ్రామం

గౌరారం కలాన్‌లోని వందల ఏళ్ల చరిత్ర ఉన్న హనుమాన్ ఆలయం

సండే స్పెషల్

కలాన్.. ఖుర్దు..

ఒకే పేరుతో ఊళ్లు

- తికమక లేకుండా పార్సీ పదాల జత
- కలాన్ అంటే పెద్ద.. ఖుర్దు అంటే చిన్న అని అర్థాలు
- రికార్డులతో పాటు వాడుకలోనూ అవే..

జిల్లాలోని పలు ఊళ్ల పేర్లకు చివరన కలాన్, ఖుర్దు అనే తోకలుంటాయి. వ్యవహారంలోనే కాదు రికార్డుల్లోనూ అవే పేర్లుంటాయి. అయితే వాటి అర్థాలు మాత్రం చాలా మందికి తెలియవు. ఇవి పార్సీ పదాలు. పార్సీలో కలాన్ అంటే పెద్ద, ఖుర్దు అంటే చిన్న అన్న అర్థాలున్నాయి. పెద్ద గ్రామాన్ని కలాన్ అని, చిన్న గ్రామాన్ని ఖుర్దు అని పిలుస్తారు. ఇలా కలాన్, ఖుర్దు అన్న తోక పేర్లున్న గ్రామాలపై సండే స్పెషల్..

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలోని గాంధారి, లింగంపేట, నాగిరెడ్డిపేట తదితర మండలాల్లో పలు గ్రామాలకు కలాన్, ఖుర్దు అనే తోక పేర్లున్నాయి. కొన్ని చోట్ల ఒకే పేరుతో రెండు గ్రామాలుంటే ఒక దానికి కలాన్ అని, మరోదానికి ఖుర్దు అనే తోకలు జత చేశారు. మరికొన్ని చోట్ల ఒక పేరుతో ఒకే గ్రామం ఉన్నా దానికి కూడా కలాన్ అనో.. ఖుర్దు అనో.. ఉండడం గమనార్హం.

పాతంగల్ కలాన్, పాతంగల్ ఖుర్దు

గాంధారి మండలంలో పాతంగల్ అనే పేరుతో రెండు గ్రామాలున్నాయి. ఇందులో ఒక గ్రామాన్ని పాతంగల్ కలాన్ అని, మరో గ్రామాన్ని పాతంగల్ ఖుర్దు అని పిలుస్తారు. రికార్డుల్లోనూ అలాగే నమోదు చేశారు. పెద్ద గ్రామమైన పాతంగల్ కలాన్‌ను కొందరు పెద్ద పాతంగల్ అని, చిన్న గ్రామమైన పాతంగల్ ఖుర్దును చిన్న పాతంగల్ అని కూడా పిలుస్తున్నారు.

లింగంపల్లి ఖుర్దు..

లింగంపేట మండలంలో లింగంపల్లి ఖుర్దు అనే గ్రామం ఉంది. రికార్డులోనూ ఇదే పేరుతో ఉంది. అయితే సమీపంలో లింగంపల్లి కలాన్ అనే ఊరు లేకపోయినా ఖుర్దు అని వ్యవహరిస్తుండడం గమనార్హం.

లింగంపల్లి కలాన్..

నాగిరెడ్డిపేట మండలంలో లింగంపల్లి కలాన్ ఉంది. ఊరు పెద్దగా ఉండడంతో లింగంపల్లి కలాన్ అని పేరు వచ్చి ఉంటుందని భావిస్తున్నారు. సదాశివనగర్ మండలంలో లింగంపల్లి అనే ఊరుంది.



గౌరారం కలాన్ గ్రామం

గౌరారం కలాన్..

గాంధారి మండలంలో గౌరారం కలాన్ అనే ఊరుంది. ఇది పెద్ద గ్రామం.. అయితే గౌరారం పేరుతో చుట్టుపక్కల మరో గ్రామం లేకపోయినా దీనిని గౌరారం కలాన్ అనే రికార్డుల్లో నమోదు చేశారు. కాగా వ్యవహారంలో మాత్రం ఎక్కువగా గౌరారం అనే పిలుస్తారు.

రికార్డుల్లో లింగంపల్లి కలాన్ అనే ఉంది



మా ఊరు పేరు లింగంపల్లి కలాన్. పంచాయతీ, స్కూల్ రికార్డుల్లో లింగంపల్లి కలాన్ అనే ఉంటుంది. లింగంపల్లి అని కూడా పిలుస్తాం.

– గడ్డం ఏసు, లింగంపల్లి కలాన్

తాతల కాలం నుంచి అట్లనే ఉంది



తాతల కాలం నుంచి గౌరారం కలాన్ అనే రికార్డుల్లో ఉంది. ఇప్పటికీ అదే పేరు కొనసాగుతోంది. వేరే జిల్లాలో గౌరారం అనే మరో గ్రామం ఉందని, దాన్ని చిన్న గౌరారం అని అంటారట. మా ఊరు పెద్దది కావడంతో పెద్ద గౌరారం అని గౌరారం కలాన్ అనే పేరొచ్చిందని చెబుతారు.

– తూము అంజయ్య, గౌరారం కలాన్

ఇంటి నుంచి తల్లిదండ్రుల గెంటివేత

- భూమిని తన పేరిట మార్చాలని పట్టాదారు పాసుపుస్తకాలను లాక్కెళ్లిన మూడో కొడుకు
- భిక్కనూరు మండలం కాచాపూర్‌లో ఘటన
- పోలీసులను ఆశ్రయించిన వృద్ధ దంపతులు



ఇంటి బయట కూర్చున్న వృద్ధ దంపతులు

భిక్కనూరు : సమాజంలో రోజురోజుకు మానవ సంబంధాలు క్షీణిస్తున్నాయి. వృద్ధులైన తల్లిదండ్రులను వారి పేరిట ఉన్న భూమిని తనకు ఇవ్వాలని మూడో కుమారుడు ఇంటినుంచి గెంటివేశాడు. ఈ ఘటన భిక్కనూరు మండలం కాచాపూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కాచాపూర్ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులైన మర్రి బాగవ్వ–రామయ్యలకు నలుగురు కొడుకులు. మూడో కుమారుడు చంద్రం ప్రేమ పెళ్లి చేసుకుని నిజామాబాద్‌లో నివసిస్తున్నాడు. మిగతా ముగ్గురు కుమారులు కాచాపూర్ గ్రామంలోనే నివసిస్తూ తల్లిదండ్రుల బాగోగులు చూసుకుంటున్నారు. రామయ్య పేరిట గ్రామంలో 1530 సర్వే నంబర్‌లో ఐదు ఎకరాల నాలుగు గుంటల భూమి ఉంది. రామయ్య బాగవ్వ దంపతులు తమ నలుగురు కుమారులకు ఒక్కొక్కరికి ఎకరం చొప్పున భూమిని పంచి వారి పేరిట పట్టా చేయించారు. మిగతా ఎకరం నాలుగు గుంటలను తమ పేరిట ఉంచుకున్నారు. తమ బాగోగులు చూసిన వారికి తదనంతరం ఈ భూమి వర్తిస్తుందని కుల పెద్ద మనుషుల ముందు ఒప్పందం చేసుకున్నారు. మూడో కొడుకు చంద్రం తల్లిదండ్రుల పేరిట ఉన్న భూమిలో తన వాటాకు రావాల్సిన భూమిని ఇవ్వాలని వారిని వేధిస్తున్నాడు. పట్టాదారు పాసు పుస్తకాలను లాక్కెళ్లాడు. ఈ విషయమై కులపంచాయతీ జరిగింది. తల్లిదండ్రులు బాగోగులు చూసిన వాళ్లకు ఈ భూమిపై హక్కులు ఉంటాయని తల్లిదండ్రులు బతికి ఉన్నంత కాలం ఈ భూమిని ఎవరి పేరుమీద మార్చవద్దని పంచాయతీలో పెద్దలు నిర్ణయించారు. దీంతో చంద్రం శనివారం తల్లిదండ్రులు నివసిస్తున్న ఇంటికి వచ్చి వారిని బయటకు గెంటి వేశాడు. సామగ్రిని బయట పారేసి ఇంటికి తాళం వేశాడు. దీంతో వృద్ధులైన తల్లిదండ్రులు బాగవ్వ, రామయ్యలు భిక్కనూరు పోలీసులను ఆశ్రయించారు. వీరి ఫిర్యాదు మేరకు ఎస్సై ఆంజనేయులు చంద్రంపై కేసు నమోదు చేశారు.

ఘనంగా ఈద్ ఉల్ అజ్ హా



జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం వద్దనున్న ఈద్గాలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో శనివారం బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కామారెడ్డి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ముందు, పెద్దమ్మ ఆలయం సమీపంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆర్డీవో కార్యాలయం వద్దనున్న ఈద్గాలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ప్రసంగించారు. త్యాగాలకు సార్థకత చేకూరుతుందనే సందేశాన్ని బక్రీద్ పండుగ విశ్వమానవాళికి అందిస్తుందన్నారు. సకల మతవిశ్వాసాలను, సంప్రదాయాలను గౌరవిస్తూ రాష్ట్రంలో, దేశంలో పాలన కొనసాగాలని ఆకాంక్షించారు.

భద్రత ఏర్పాట్ల పరిశీలన

బక్రీద్ పర్వదినం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఈద్గాలు, మసీదుల వద్ద భద్రత ఏర్పాట్లను ఎస్పీ రాజేశ్ చంద్ర పరిశీలించారు. అర్బత్ మసీద్ ఈద్గా, ఇస్లాంపురా, గొల్లవాడ, ఇందిరానగర్ కాలనీ, వాంబే కాలనీ, సైలానీ బాబా కాలనీ, బతుకమ్మ కుంట, అశోక్‌నగర్, విద్యానగర్ ప్రాంతాల్లోని మసీదుల వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. పండుగలను సంతోషకరమైన, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఒకరి మత సంప్రదాయాలను మరొకరు గౌరవించుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏఎస్పీ చైతన్యరెడ్డి, పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.



జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి నుంచి ఆర్టీసీ టూర్ ప్యాకేజీలు

- పుణ్యక్షేత్రాలు, దర్శనీయ ప్రదేశాలకు ప్రత్యేక బస్సులు
- ఈనెల 27 నుంచి ప్రారంభం
- ఆర్టీసీ డీఎం కరుణశ్రీ

కామారెడ్డి టౌన్: పుణ్యక్షేత్రాలు, దర్శనీయ ప్రాంతాలకు వెళ్లే వారికి ప్రత్యేక టూర్ ప్యాకేజీని ఆర్టీసీ అందుబాటులోకి తీసుకొచ్చిందని సంస్థ కామారెడ్డి డిపో మేనేజర్ కరుణశ్రీ తెలిపారు. కామారెడ్డి బస్టాండ్ నుంచి ఆయా ప్రదేశాలకు ప్రత్యేక బస్సులను వేశామని పేర్కొన్నారు. ఈనెల 27న రాష్ట్ర స్థాయిలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లాంఛనంగా ఈ బస్సు సర్వీసులను ప్రారంభిస్తారని తెలిపారు. సామూహికంగా ఒకేసారి 30 నుంచి 35 మంది కోసం బస్ బుక్ చేస్తే ఒకరికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. అలాగే అందరికీ కలిపి పది శాతం రాయితీ ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసకోవాలని డీఎం కోరారు. ఇతర వివరాలకు కామారెడ్డి డిపో కార్యాలయంలోగాని, 73828 51280, 73828 43747, 08468–220281 నంబర్లలోగాని సంప్రదించాలని సూచించారు.

ప్యాకేజీల వివరాలు...

కామారెడ్డి నుంచి వరంగల్ వెయ్యి స్తంభాల గుడి, భద్రకాళి గుడి, రామప్ప దేవాలయం, లక్నవరం చెరువు ప్రాంతాలకు ఒకరోజు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు దర్శించుకుని తిరిగి కామారెడ్డికి చేరడానికి పెద్దలకు ఒక్కరికి రూ. 850, పిల్లలకు రూ. 500 చార్జి చెల్లించాలి.

కామారెడ్డి నుంచి హైదరాబాద్ బిర్లా మందిర్, సాలర్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, జూపార్క్ ఒకరోజు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు దర్శించుకుని కామారెడ్డికి తిరుగు ప్రయాణం కోసం పెద్దలకు రూ. 500, పిల్లలకు రూ. 300 చార్జి చెల్లించాల్సి ఉంటుంది.

బడికి బాసటగా..

- ఫరీదుపేటలో ఒక్కటైన పూర్వ విద్యార్థులు
- మౌలిక సదుపాయాలపై దృష్టి
- రూ. 30 లక్షల నిధి సమీకరణ
- విద్యార్థులను పోటీ పరీక్షలకు తీర్చిదిద్దేలా చర్యలు

నేడు ఆత్మీయ సమ్మేళనం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : తమ ఉన్నతికి బాటలు వేసిన చదువుల చెట్టుకు పూర్వ వైభవం తీసుకురావడానికి నడుం బిగించారు పాల్వంచ మండలం ఫరీదుపేట జెడ్పీ హైస్కూల్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల పూర్వ విద్యార్థులు. బడిలో కావలసిన మౌలిక సదుపాయాల కల్పన, కంప్యూటర్ తరగతుల నిర్వహణ, ఐఐటీ వంటి పరీక్షలకు సన్నద్ధం చేయడానికి అవసరమైన బోధకులు, పుస్తకాలు సమకూర్చడానికి అవసరమైన నిధిని సమకూర్చాలని నిర్ణయించుకున్నారు. ఇక్కడ చదివిన వారిలో ప్రొఫెసర్లు, డాక్టర్లు, సీఏ, టీచర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు.. ఇలా వివిధ స్థాయిల్లో స్థిరపడిన వారు ఉన్నారు. పాఠశాల అభివృద్ధికి వారంతా తలా ఓ చేయి అందించడానికి ముందుకు వచ్చారు. తమ స్థోమతను బట్టి తలా కొంత జమ చేసి రూ.30 లక్షలు నిధిని సిద్ధం చేశారు. అలాగే అదే బడిలో చదివి రాజకీయ నాయకులు కూడా పాఠశాల అభివృద్ధిలో తాము సైతం అంటున్నారు. అలాగే ఇంటింటికీ తిరిగి పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతున్నారు. పాఠశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించడానికి ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు.

లక్ష్యాలు..

- ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం.
- ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుంటూ గ్రామంలోని పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం.
- విద్య, క్రీడా, కళారంగాల్లో రాణిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించడం.
- విద్యార్థులకు ఐఐటీ ఫౌండేషన్, కంప్యూటర్ స్కిల్స్, పోటీ పరీక్షలు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు చేపట్టడం.
- పూర్వ ప్రాథమిక స్థాయి నుంచే ఆంగ్ల భాషపై తర్ఫీదు ఇవ్వడం.
- పూర్వ విద్యార్థులను ప్రస్తుత విద్యార్థులతో అనుసంధానం చేయడం.

పాఠశాలలో చేపట్టిన కార్యక్రమాలు..

ఫరీదుపేటలోని పాఠశాలల భవనాలకు రంగులు వేయించారు. గ్రౌండ్‌ను చదును చేయించారు. పూల మొక్కలు నాటించారు. శిథిలమైన భవనాలు, టాయ్‌లెట్లను కూల్చివేయించి నూతనంగా టాయ్‌లెట్లు నిర్మించారు. ప్రభుత్వ నిధులతో ప్రహరీ నిర్మాణం చేపట్టారు. రెండు నెలల కాలంలో పూర్వ విద్యార్థులు గ్రామ పెద్దలతో కలిసి పాఠశాల రూపురేఖలను మార్చారు.



పూర్వ విద్యార్థుల సాయంతో రంగులు దిద్దుకున్న పాఠశాల భవనం

క్లుప్తంగా

కలిసిమెలిసి ముందుకెళ్లాలి



బోధన్: కులాలు, మతాలకు అతీతంగా ప్రజలంతా కలిసిమెలిసి ముందుకెళ్లాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఎడపల్లి మండలంలో ఎమ్మెల్సీ శనివారం పర్యటించారు. మండలంలోని బాపూనగర్‌కు చెందిన తెలంగాణ జాగృతి నాయకుడు రంజిత్ దంపతుల ఇంటికి వెళ్లి వారిని ఆశీర్వదించారు. కుర్నాపల్లి గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ రవీందర్ గౌడ్-సావిత్రి ఇంటికెళ్లి కుటుంబ సభ్యులను కలిసి వారి మనవడిని ఆశీర్వదించారు. అనంతరం గ్రామంలో ముస్లిములను కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఆమెవెంట మాజీ ఎంపీపీ శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, నాయకులు శేఖర్ రాజు, ఎంబ రాజేశ్వర్, జైతాపూర్ మాజీ సర్పంచ్ లతాశ్రీ, జాగృతి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పరుగు పెడితే పతకమే..

- దశాబ్దానికి పైగా జాతీయస్థాయిలో రాణిస్తున్న వేల్పూర్ వాసి అశోక్
- నేడు హైదరాబాద్‌లో నిర్వహించనున్న పోటీలకు అంబాసిడర్‌గా ఎంపిక
- జిల్లా రవాణాశాఖలో హోంగార్డుగా ఉద్యోగం చేస్తూనే రాణింపు

వేల్పూర్: రవాణాశాఖలో హోం గార్డుగా పని చేస్తున్న గుగ్గిలం అశోక్ రన్నింగ్‌లో జాతీయ స్థాయిలో రాణిస్తున్నాడు. వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన అశోక్ పుట్టిన ఊరితోపాటు రాష్ట్రానికి గుర్తింపు తీసుకువస్తున్నాడు. పరుగు పెడితె పతకమే అన్న విధంగా దశాబ్దానికి పైగా జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటూ సుమారు 65 పతకాలు సాధించాడు. రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం అవంతిక కన్‌స్ట్రక్షన్స్ నిర్వహించే 3కే, 5కే, 10కే, 21కే రన్నింగ్ పోటీలకు అశోక్ అంబాసిగర్‌గా గుర్తింపు పొందాడు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించనున్నారు.

నాలుగు మారథాన్‌లకు అంబాసిడర్

జాతీయస్థాయి రన్నింగ్‌లో ప్రతిభ చాటిన అశోక్ ఇప్పటివరకు నాలుగు మారథాన్‌లకు అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. మొదట కామారెడ్డిలో మా అసోసియేషన్ వారు నిర్వహించిన ఆఫ్ మారథాన్‌కు, హైదరాబాద్‌లో నిర్వహించిన హిస్టారికల్ రన్‌కు, వరంగల్‌లో నిర్వహించిన మారథాన్‌కు అంబాసిడర్‌గా వ్యవహరించగా, ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఈవెంట్‌కు అంబాసిడర్‌గా వ్యవహరించనున్నారు.



అశోక్‌ను అభినందిస్తున్న కలెక్టర్ సంగ్వాన్ (ఫైల్)

పేదరికం నుంచి పరుగువైపు..

వేల్పూర్‌లో గురువు మురళీధర్‌రెడ్డి వద్ద శిక్షణ పొందిన అశోక్ మండల, జోన్, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఎన్నో పతకాలు సాధించారు. విద్యార్థి దశలోనే సంగారెడ్డిలోని స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశం లభించినా పేదరికం అడ్డురావడంతో వెళ్లలేకపోయారు. ఇంటర్ వరకు చదివిన అశోక్ కుటుంబ పోషణకు ఆటో నడుపుతూ పదేళ్లపాటు ఆటలకు దూరంగా ఉన్నారు. 2012లో స్పోర్ట్స్ కోటాలో రవాణాశాఖలో హోంగార్డుగా ఉద్యోగం పొందిన అశోక్ ప్రస్తుతం కామారెడ్డిలో విధులు నిర్వర్తిస్తున్నారు. క్రీడలపై ఉన్న మక్కువతో తిరిగి తన సాధనను ప్రారంభించాడు. అశోక్‌ను కామారెడ్డిలో ఫిజికల్ డైరెక్టర్ గోపీరెడ్డి మా అసోసియేషన్‌లో చేర్చి ప్రోత్సహించారు. వేల్పూర్ వాసి పన్నాల హరీశ్‌రెడ్డి సూచనతో లాంగ్ రన్నింగ్‌పై దృష్టి సారించారు.

ఉమ్మడి రాష్ట్రం తరఫున విశిష్ట పురస్కారం

రన్నింగ్ పోటీల్లో జాతీయస్థాయి క్రీడాకారుడిగా పేరుపొందిన అశోక్‌ను ఈ ఏడాది ఫిబ్రవరి 9వ తేదీన రవీంద్రభారతిలో ఉమ్మడి రాష్ట్రాల ఉత్తమ క్రీడాకారుడిగా కవయిత్రి మొల్ల మాంబ జయంతి సందర్భంగా శాలివాహన విశిష్ట పురస్కారంతో ఏసీపీ డీజీపీ, తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ పూర్ణచందర్‌రావు, ఇతర అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సైం అభినందించారు. వేల్పూర్ వీడీసీ వారు, మిత్రులు, శ్రేయోభిలాషులు పలుమార్లు అశోక్‌ను సన్మానించారు.

ఒలింపిక్స్‌లో పతకం సాధించాలి



ఒలింపిక్స్‌లో నిర్వహించే 42 కిలోమీటర్ల ఫుల్ మారథాన్ పోటీల్లో పాల్గొని పతకం సాధించాలన్నదే నా కోరిక. ఈ రన్నింగ్ ఈవెంట్‌తో ఒలింపిక్ పోటీలకు ముగింపు పలుకుతారు. ఇప్పటిదాకా సాధించిన విజయాల స్ఫూర్తితో ఒలింపిక్‌లో పతకం సాధిస్తా. నన్ను ప్రోత్సహిస్తున్న ఆత్మీయులందరికీ రుణపడి ఉంటా. – అశోక్

దేవుడి పేరే ఊరి పేరైంది

మీకు తెలుసా?

వీరన్నగుట్ట గ్రామానికి ఆ పేరు రావడానికి ఓ చరిత్ర ఉంది. నాలుగు వందల సంవత్సరాల కిందట గుట్టమీద ఉన్న బండరాయి పగిలి రెండుగా విడిపోగా వాటి మధ్యలో వీరభద్రస్వామి విగ్రహం బయటపడినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. అప్పటి నుంచి చుట్టుపక్కల గ్రామాల భక్తులు ఆలయంలో పూజలు ప్రారంభించారు. కొంతకాలానికి బోధన్ షుగర్ ఫ్యాక్టరీ భూముల్లో చెరుకు నరికేందుకు పలు ప్రాంతాలకు చెందిన కూలీలు వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. ముందుగా సాటాపూర్ ఫారంగా పంచాయతీ ఏర్పాటైంది. కాలక్రమేణ జనాభా పెరగడంతో వీరన్నగుట్టగా దేవుడిపేరుతో గ్రామానికి పేరు వచ్చింది. ప్రతి సంవత్సరం మహా శివరాత్రి జరిగిన మూడో రోజు ఇక్కడి ఆలయంలో రథోత్సవం, జాతరను వైభవంగా నిర్వహిస్తారు. భక్తుల కొంగు బంగారంగా వీరభద్రుడు విరాజిల్లుతున్నాడు.



వీరభద్రస్వామి ఆలయ ముఖద్వారం

– రెంజల్(బోధన్)

బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో ప్రవేశాలు ఇలా..

మీకోసం

జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ఎస్సీ (షెడ్యూల్డ్ కులం) విద్యార్థులు మాత్రమే ప్రవేశాలు పొందవచ్చు. ఒకటో తరగతి (నాన్ రెసిడెన్షియల్), ఐదో తరగతి (రెసిడెన్షియల్)ల్లో ప్రవేశాల కోసం ఆసక్తి ఉన్న విద్యార్థులు సంబంధిత పాఠశాలల్లో దరఖాస్తులు అందించాలి.

దరఖాస్తులు లభించే ప్రాంతం

- నిజామాబాద్ డివిజన్‌కు చెందిన విద్యార్థులు జిల్లా కేంద్రంలోని కోటగల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో(63026 61897) సంప్రదించాలి.
- బోధన్ డివిజన్‌కు చెందిన విద్యార్థులు విజయమేరీ ఉన్నత పాఠశాలలో(90103 42437) సంప్రదించాలి.
- ఆర్మూర్ డివిజన్‌కు చెందిన విద్యార్థులు ప్రభుత్వ ఎస్సీ బాలికల కళాశాలలో(96760 96374) సంప్రదించాలి.

దరఖాస్తు చివరి తేదీ

ఈనెల 16

అవసరమైన ధ్రువపత్రాలు

కుల, ఆదాయ, నేటివిటీ ధ్రువీకరణపత్రాలతో పాటు బర్త్ సర్టిఫికేట్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు. గెజిటెడ్ అధికారి ధ్రువీకరించాల్సి ఉంటుంది.

అర్హతలు

- ఒకటో తరగతిలో ప్రవేశం కోసం ఎస్సీ కులానికి చెందిన విద్యార్థులు 1.6.2019 నుంచి 31.05.2020 మధ్యలో జన్మించి ఉండాలి. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల కుటుంబ సంవత్సర ఆదాయం రూ.లక్షా50 వేలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలోపు మించొద్దు.
- ఐదో తరగతిలో ప్రవేశం కోసం నాల్గో తరగతి బోనోఫైడ్, ప్రోగ్రెస్‌కార్డు జిరాక్స్ తప్పనిసరిగా సమర్పించాలి.

సీట్ల కేటాయింపు ఇలా

- ఒకటో తరగతిలో ఎస్సీ గ్రూప్–1 వారికి ఏడు సీట్లు, గ్రూప్–2 వారికి 61 సీట్లు, గ్రూప్–3 వారికి 34 సీట్లు.
- ఐదో తరగతిలో గ్రూప్–1లో ఏడు, గ్రూప్–2లో 60, గ్రూప్–3లో 34 సీట్లు కేటాయించారు. ఐదో తరగతికి హాస్టల్ సదుపాయం ఉంటుంది.

– నిజామాబాద్‌అర్బన్

నేడు మృగశిర కార్తె


నిజామాబాద్ రూరల్: మృగశిర కార్తె ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. కార్తె మొదటి రోజును వివిధ ప్రాంతాల్లో మృగశిర, మృగం, మిరుగు, మిర్గం అనే పేర్లతో పిలుస్తారు. ఉమ్మడి జిల్లాలో తొలకరి వర్షాలు కురవడంతో రైతులు వ్యవసాయ పనులను ప్రారంభించేందుకు సిద్ధమవుతారు. ఇప్పటికే విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు పొలాల్లో వేయనున్నారు. మృగశిర కార్తెలో వ్యవసాయ పనులు ప్రారంభిస్తే సాగు చేసిన పంటలు తెగుళ్లు, చీడపీడల బారినపడకుండా అధిక దిగుబడి వస్తుందని రైతుల నమ్మకం.

వంటకాల ప్రత్యేకం

మృగశిర కార్తె ప్రారంభం రోజున వండే వంటకాలకు ప్రత్యేకత ఉంది. చేపలు తినడం అనాదిగా వస్తోంది. దీంతో గుండెజబ్బులు, ఆస్తమా రోగులకు ఉపశమనం కలుగుతుంది. అంతేగాకుండా వర్షాలు మొదలు కానున్న నేపథ్యంలో పలు వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. ఈ సీజన్‌లో చాలా మందికి జీర్ణశక్తితోపాటు రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంటుంది. జ్వరం, దగ్గు, ఇతర వ్యాధుల బారిన పడుతుంటారు. ఇలాంటి వాటి నుంచి గట్టెక్కాలంటే చేపలు తినాల్సిందే. దీంతోపాటు కొన్ని ప్రాంతాల్లో ప్రజలు బెల్లంలో ఇంగువ కలుపుకొని తింటారు. ఇది శరీరంలో ఉష్ణోగ్రత ప్రేరేపించి వానకాలంలో సోకే వ్యాధు లను అడ్డుకుంటుందని పెద్దల విశ్వాసం. మామిడిపండ్ల రసంతోపాటు అట్లు వేసుకొని తింటారు.

నిజామాబాద్‌లో కరోనా కేసు

జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు



నిజామాబాద్‌నాగారం : నిజామాబాద్ జిల్లాలో కరోనా పాజిటివ్ కేసు నమోదు అయ్యింది. నగరంలోని అంబేడ్కర్‌కాలనీకి చెందిన వ్యక్తికి రెండు రోజులుగా జ్వరం, దగ్గు, ఆయాసం రావడంతో శనివారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)కు చికిత్స నిమిత్తం వచ్చారు. వైద్యులు ర్యాపిడ్ టెస్ట్ చేయడంతో కరోనా పాజిటివ్ వచ్చింది. దీంతో ఇంటి వద్దే ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని, మందులు వేసుకుంటే సరిపోతుందని వైద్యులు సూచించారు. అయితే ఇంటి వద్ద చిన్నపిల్లలు, వృద్ధులైన అమ్మనాన్న ఉండడంతో ఆస్పత్రిలోనే ఉండి చికిత్స తీసుకుంటానని బాధితుడు చెప్పాడు. వైద్యులు వెంటనే సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌కు సమాచారం ఇవ్వడంతో జీజీహెచ్‌లో 7వ అంతస్తులోని ఐసోలేషన్ ప్రత్యేక వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. వారం రోజుల క్రితం నగరంలో ఓ ఫంక్షన్‌కు వెళ్లడంతోనే జ్వరం, దగ్గు వచ్చినట్లు కరోనా బాధితుడు తెలిపారు. 2020 సంవత్సరంలో కూడా సదరు వ్యక్తికి కరోనా వచ్చింది.

నేడు కుటుంబ సభ్యులకు ర్యాపిడ్ పరీక్షలు

కరోనా పాజిటివ్ వచ్చిన వ్యక్తి కుటుంబానికి చెందిన సభ్యులకు ఆదివారం ర్యాపిడ్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఎవరికైనా పాజిటివ్ వస్తే ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స అందించనున్నట్లు ఆస్పత్రి వైద్యులు డాక్టర్ వెంకటేష్ తెలిపారు.

జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజలందరు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి రాజశ్రీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు. కరోనా కేసు నమోదు దృష్ట్యా జాగ్రత్తలు అవసరమన్నారు. తప్పని సరిగా అందరు మాస్కులు ధరించాలన్నా రు. శానిటైజర్ దగ్గర పెట్టుకోవాలన్నా రు. గుంపుల్లో సంచరించ వద్దన్నారు. ఎక్కడికి వెళ్లినా కచ్చితంగా మాస్కులు పెట్టుకోవాలని సూచించారు.

9 నుంచి డీఈఈ సెట్-2025 ధ్రువపత్రాల పరిశీలన

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రైమరీ స్కూల్ ఎడ్యుకేషన్ కోర్సుల ప్రవేశానికి ఇటీవల నిర్వహించిన డీఈఈ సెట్–2025 ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 9 నుంచి నిజామాబాద్ డైయిట్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ టి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వారికి కేటాయించిన తేదీల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్‌కు హాజరు కావాలని సూచించారు. ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో పాటు డీఈఈ సెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, ఇటీవల పొందిన ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఇంటిగ్రేటెడ్ కుల ధ్రువీకరణ పత్రం, పదోతరగతి, ఇంటర్మీడియట్ మార్కుల మెమోలు, 4వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బోనోఫైడ్ సర్టిఫికెట్లు, ఇతర రిజర్వేషన్లు (ఎన్‌సీసీ, క్రీడలు, దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాలు) ఉంటే సంబంధిత ఒరిజినల్ ధ్రువపత్రాలతో వెరిఫికేషన్‌కు హాజరు కావాలన్నారు. డీఈఈ సెట్ వెబ్‌సైట్‌లో హాజరు కావాల్సిన తేదీ, స్థలం, ఒరిజినల్ సర్టిఫికెట్ల వివరాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇతర సందేహాలుంటే 63095–35759, 88864–48818 నంబర్లను సంప్రదించాలని టి శ్రీనివాస్ తెలిపారు.

క్రైం కార్నర్

చెరువులో మునిగి జాలరి మృతి



ఇందల్వాయి: మండలంలోని సిర్నాపల్లి గ్రామానికి చెందిన మత్స్యకారుడు గూండ్ల కిషన్(43) ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. మృగశిర కార్తె కావడంతో చేపలు వేటాడేందుకు గ్రామంలోని తుంగకుంటలోకి వెళ్లిన కిషన్ వలలో చిక్కుకొని నీటమునిగిపోయాడు. మృతుడికి పదేళ్లలోపు వయసున్న ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

ఆత్మహత్య చేసుకున్న దంపతుల అంత్యక్రియలు పూర్తి

ఖలీల్‌వాడి: ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యల కారణంగా ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న నగరంలోని గాయత్రినగర్‌కు చెందిన దంపతులు శ్రీనివాస్(56), మమత(48) అంత్యక్రియలను శనివారం పూర్తి చేశారు. పోలీసులు మృతదేహాలకు నిజామాబాద్‌లోని జీజీహెచ్‌లో పోస్టుమార్టం పూర్తి చేయించి శనివారం కుటుంబసభ్యులకు అప్పగించారు. శ్రీనివాస్, మమత కుమారులు ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లగా, కోడలు తల్లిగారి ఇంటికి వెళ్లి తిరిగి వచ్చే సరికి ఈ ఘటన చోటు చేసుకుందని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పోక్సో కేసులో ఇద్దరి రిమాండ్

మోపాల్: పోక్సో కేసులో పరారీలో ఉన్న ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సురేశ్‌కుమార్ శనివారం తెలిపారు. మండలంలోని బైరాపూర్ గ్రామానికి చెందిన చక్రవర్తితోపాటు మరో బాలుడు ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారు. విషయం వెలుగులోకి వచ్చినప్పటి నుంచి ఇద్దరు పరారయ్యారు. శనివారం వారిద్దరు స్వగ్రామానికి వచ్చినట్లు సమాచారం అందడంతో మోపాల్ ఎస్సై యాదగిరిగౌడ్ అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేపట్టి, రిమాండ్‌కు తరలించారు. చక్రవర్తిని సారంగాపూర్ జిల్లా జైలుకు, బాలుడిని బోస్టన్ స్కూల్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఒకరి అదృశ్యం



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీకి చెందిన తౌడుపునూరి మహేశ్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. మహేశ్ కొన్ని సంవత్సరాల క్రితం సిద్దిపేట నుంచి కామారెడ్డికి వచ్చి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ ఇక్కడే స్థిరపడ్డాడు. గొడవల కారణంగా ఇటీవల భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో మహేశ్ ఒక్కడే ఉంటున్నాడు. ఈ నెల 2వ తేదీ నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో అతడి తండ్రి జయప్రకాశ్ శనివారం కామారెడ్డిలోని ఇంటికి వచ్చి చూశాడు. మహేశ్ ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఆత్మహత్యాయత్నం

లింగంపేట(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇల్లు రాలేదని మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన లింగంపేట మండలం కొర్పోల్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నర్సని కాశీరామ్‌కు ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని, మొదటి విడత లిస్టులో పేరు వచ్చిందని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తెలిపారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు కాశీరాం తాను నివాసం ఉంటున్న గుడిసెను తొలగించి స్థలం చదును చేసుకున్నాడు. ఇంటి నిర్మాణ సమయంలో డబ్బులకు ఇబ్బంది రావొద్దని ముందుగా తనకు ఉన్న 20 గుంటల వ్యవసాయ భూమిని అమ్మేశాడు. ఆ తరువాత జాబితాలో తన పేరు రాకపోవడంతో కలత చెందాడు. ఉన్న గుడిసె తొలగించడంతో ఉండడానికి ఇల్లు లేకుండా పోయిందని, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించాలని నాయకులను వేడుకున్నాడు. ఈ క్రమంలో తీవ్రమనస్తాపానికి లోనై శనివారం మధ్యాహ్నం గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన అతడిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కాశీరాం

ఇల్లు రిజిస్ట్రేషన్ చేయడం లేదని ఆవేదన.. గుండెపోటుతో మహిళ మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన గాజుల రాజమణి గుండెపోటుతో మృతి చెందింది. అయితే తన అసిసెమెంట్ నంబర్‌తో గంగోనే రాజేశ్వర్ అనే వ్యక్తి తన ఇంటిని రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో తీవ్రమనస్తాపానికి గురై రాజమణి గుండెపోటుతో మృతి చెందిందని ఆమె సోదరి లలిత, కుటుంబ సభ్యులు ఆరోపించారు. రాజమణి మృతదేహంతో రాజేశ్వర్ ఇంటి ఎదుట ధర్నా చేశారు. రాజేశ్వర్ ఆరు నెలలుగా ఇంటి రిజిస్ట్రేషన్‌ను రాజమణి పేరుపైకి మార్చడంలేదని, దీంతో తీవ్ర ఆందోళనకు గురైన రాజమణికి శుక్రవారం గుండెపోటు వచ్చిందని కుటుంబ సభ్యులు తెలిపారు. పరిస్థితి విషమించి శనివారం మృతి చెందడంతో ఆమె మృతదేహంతో ధర్నా చేశారు. సమాచారం అందుకున్న టౌన్ సీఐ శ్రీనివాస్‌రాజు, ఎస్సై హరిబాబు ఘటనాస్థలానికి చేరుకొని ఇరు వర్గాలతో మాట్లాడారు. సోమవారం రోజున ఇంటి రిజిస్ట్రేషన్ మార్పు చేయించి ఇస్తానని గంగోనె రాజేశ్వర్ ఒప్పుకోవడంతో పరిస్థితి సద్దుమణిగింది.



రాజేశ్వర్ ఇంటి ఎదుట రాజమణి మృతదేహంతో ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య



పెంటయ్య (ఫైల్)

రాజంపేట: మండలంలోని ఆర్గొండ గ్రామానికి చెందిన రైతు జంగిటి పెంటయ్య(48) ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై పుష్పరాజ్, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పెంటయ్య గ్రామ శివారులోని తనకున్న 20 గుంటల భూమిలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. యాసంగిలో జొన్న సాగు చేయగా అనుకున్న దిగుబడి రాకపోవడం, తన ఇద్దరు కూతుళ్ల పెళ్లిళ్లకు చేసిన అప్పులు కూడా భారం కావడంతో మానసిక ఆందోళనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం 7:30 గంటలకు పొలానికి వెళ్తున్నానని ఇంట్లో నుంచి వెళ్లిన పెంటయ్య తిరిగిరాలేదు. కొద్ది సేపటి తరువాత అదే గ్రామానికి చెందిన జంగిటి దుర్గయ్య అనే వ్యక్తి ఫోన్ చేసి పంట పొలంలోని చెట్టుకు పెంటయ్య ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. మృతుడి భార్య రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి..

భిక్కనూరు: మండలంలోని మల్లుపల్లి గ్రామానికి చెందిన ఆకారపు స్వామి(39) అనే వ్యక్తి మతిస్థిమితం లేక ఆత్మహత్య చేసుకున్నట్లు భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. భార్య సంధ్యతో కలిసి ఐదేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్న స్వామికి గత కొన్ని నెలలుగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రుల్లో చిక్తిస చేయించారు. స్వామి గత నెల29వ తేదీన హైదరాబాద్ నుంచి మల్లుపల్లికి వచ్చిన స్వామి పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు వెంటనే అతడిని ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి అక్కడి నుంచి సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి శనివారం ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాసరలో మకాం.. నిజామాబాద్‌లో చోరీలు

- ముగ్గురి అరెస్ట్.. పరారీలో ఒకరు

ఖలీల్‌వాడి: బాసరలో ఇల్లు అద్దెకు తీసుకుని నిజామాబాద్‌లో చోరీలకు పాల్పడుతున్న ముఠాను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. జగిత్యాల జిల్లా కేంద్రంలోని చిలుకల వాడకు చెందిన షేక్ యామీన్ అలియాస్ సమీర్ అలియాస్ గోపి (40), ఆదిలాబాద్ జిల్లా తాటిగూడ రైల్వేస్టేషన్‌కు చెందిన సయ్యద్ ఫరూక్ (22), మహారాష్ట్రకు చెందిన సత్య నిర్మల్ జిల్లా బాసరలో ఇంటిని అద్దెకు తీసుకుని నిజామాబాద్ జిల్లాలో చోరీలకు పాల్పడుతున్నారు. యామీన్, సయ్యద్ ఫరూక్ 20 పైగా కేసుల్లో జైలుకి వెళ్లి వచ్చారు. శనివారం నిజామాబాద్ నగరంలోని రైల్వేస్టేషన్‌లో పార్క్ చేసిన బైక్‌ని దొంగతనం చేసి, అదే బైక్‌పై చోరీ కోసం వెళ్తుండగా పోలీసులు పట్టుకుని విచారించారు. నిందితులు ఎడపల్లి పీఎస్ పరిధిలోని ఓ ఇంటితో పాటు పాన్‌షాప్‌లో, నగరంలోని మూడో టౌన్ పీఎస్ పరిధిలోని తాళం వేసి ఉన్న ఇంట్లో, జక్రాన్‌పల్లి పీఎస్ పరిధిలోని బెల్ట్‌షాప్‌లో, రైళ్లలో తిరుగుతూ సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడినట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నారు. నిందితుల్లో సత్య పరారీలో ఉండగా, పట్టుబడ్డ నిందితుల నుంచి రూ.5 వేల నగదు, ఐదు సెల్‌ఫోన్లు, ఒక టీవీ, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. నిందితుల నుంచి దొంగసొత్తును కొన్న హైదరాబాద్‌లోని కొంపెల్లికి చెందిన అరవింద్ ప్రసాద్‌పైన కూడా కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.




నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువులు, నగదు

మీ మెదడు చెప్పే మాట వినండి

బ్రెయిన్ ట్యూమరా.. భయం వద్దు

- ఎంఆర్ఐతో సమస్యను గుర్తించొచ్చు
- వైద్యుల చికిత్సతో నయమయ్యే అవకాశం
- నేడు ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ డే



నిజామాబాద్‌నాగారం: తలనొప్పిని పని ఒత్తిడిగా... మతిమరుపును వయసు ప్రభావంగా... కళ్లు తిరగడాన్ని అలసటగా తేలికగా తీసుకుంటాం. ఒక్కోసారి సాధారణ లక్షణాలే మన మెదడులోని ఒక తీవ్రమైన సమస్యకు సంకేతాలు కావొచ్చు. మీ మెదడు మౌనంగా సహాయం కోరుతోందేమో ఎప్పుడైనా ఆలోచించారా..? మెదడు చెప్పే మాట వింటే మనం ముప్పు నుంచి బయటపడొచ్చు. నేడు(ఆదివారం) ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ డే సందర్భం ప్రత్యేక కథనం..

జిల్లాలో ఇలా...

జిల్లాలో సుమారు 10మంది వరకు న్యూరో సర్జన్‌లు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు నెలకు 4వరకు బ్రెయిన్ ట్యూమర్‌కు సంబంధించిన రోగులు వస్తున్నారు. నెలకు సుమారు 40మంది వరకు బ్రెయిన్ ట్యూమర్ బాధితులు వైద్యుల వద్దకు ట్రీట్‌మెంట్ కోసం వస్తున్నారు. ఎమ్ఆర్ఐ స్కానింగ్ చేస్తే ఎలాంటి ట్యూమర్ ఉందో ఇట్లే తెలుసుకోవచ్చు. తద్వారా చికిత్స తీసుకుంటే నయం అవకాశాలు ఎక్కువ.

లక్షణాలు

మీకు మీ కుటుంబసభ్యులకు ఉదయం పూట తరచుగా వచ్చే తీవ్రమైన తలనొప్పులు, వ్యక్తిత్వంలో అకస్మాత్తుగా మార్పులు, చూపు మసకబారడం, మాట తడబడటం, మతిమరుపు లేదా గతంలో ఎప్పుడూ లేని ఫిట్స్ (మూర్ఛలు) వంటి లక్షణాలు ఉంటే గమనించాలి. వీటిని అస్సలు నిర్లక్ష్యం చేయొద్దు. ఇవి బ్రెయిన్ ట్యూమర్ సంకేతాలు కావొచ్చు. వీలైనంత త్వరగా డాక్టర్‌ని సంప్రదించి, అవసరమైన స్కానింగ్‌లు చేయించుకోవాలి.

ట్యూమర్‌కు భయపడొద్దు..



బ్రెయిన్‌ట్యూమర్ అనగానే భయపడొద్దు. గతంలో ట్యూమర్ వస్తే చనిపోతారనే భయం ఉండేది. ప్రస్తుతం వైద్యం అందుబాటులో ఉంది. ట్యూమర్‌లో చాలా రకాల క్యాన్సర్‌లు ఉంటాయి. ప్రతి ట్యూమర్ క్యాన్సర్ కాదు. 50శాతం క్యాన్సర్ ఉండదు. ఆపరేషన్‌తో నయం అవుతుంది. చాలా ట్యూమర్‌లు జన్యుపరమైనవి కావచ్చు. ఏదీ ఏమైనా ఎమ్ఆర్ఐ చేస్తే తెలిసిపోతుంది. తద్వారా చికిత్సతో నయమవుతుంది.

– నరసింహ కట్ట, న్యూరోసర్జన్, మనోరమ ఆస్పత్రి

మంచి చికిత్స ఉంది



ఒక వ్యాధిగా కాకుండా, రోగికి కొత్త జీవితాన్ని ప్రసాదించే అవకాశంగా చూస్తాం. అధునాతన, న్యూరో–నావిగేషన్ సిస్టమ్స్, మినిమల్ ఇన్వాసివ్ సర్జరీ, రోబోటిక్ సర్జరీ వంటి అత్యాధునిక పద్ధతులను ఉపయోగించి, రోగులకు సురక్షితమైన, వేగవంతమైన కోలుకునే చికిత్సను అందిస్తున్నాం.ఒక చిన్న స్కాన్, ఒక సరైన వైద్య నిర్ణయం ఒకరి జీవితాన్ని, ఒక కుటుంబ భవిష్యత్తును పూర్తిగా మారుస్తుంది.

– శ్రీకృష్ణ ఆదిత్య, న్యూరోసర్జన్, మెడికవర్ ఆస్పత్రి